సాక్షి
రంగారెడ్డి
సోమవారం । 25 । డిసెంబర్ । 2023



కప్పేసిన మంచు దుప్పటి

చలి తీవ్రత పెరిగింది. దట్టమైన పొగమంచు కమ్మేయడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. 8లో▸



కొత్తూరు: వేడుకలకు ముస్తాబైన చర్చి

క్రిస్మస్ వెలుగులు

క్రిస్మస్ వేడుకలు జరుపుకొనేందుకు జిల్లాలోని చర్చిలు ముస్తాబయ్యాయి. రంగురంగుల విద్యుత్ దీపాలు.. క్రిస్మస్ ట్రీలు.. స్టార్‌లతో అందంగా అలంకరించారు. సోమవారం ప్రత్యేక ప్రార్థనలతో వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

న్యూస్‌రీల్



హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన కలెక్టర్లు, ఎస్పీల సమావేశం లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ భారతి హోళికేరి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి.

జాతీయ స్కూల్ గేమ్స్ షూటింగ్ టోర్నీకి మునావర్



సాక్షి, హైదరాబాద్: జాతీయ స్కూల్ గేమ్స్ షూటింగ్ పోటీల్లో పాల్గొనే తెలంగాణ జట్టులో హైదరాబాద్ కుర్రాడు సయ్యద్ మునావర్ ఎంపికయ్యాడు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఈ టోర్నీ ఈనెల 27 నుంచి జనవరి 1 వరకు జరుగుతుంది. ఆసిఫ్‌నగర్‌లోని తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ స్కూల్‌లో పదో తరగతి విద్యార్థి అయిన మునావర్ 10 మీటర్ల ఓపెన్ సైట్ ఈవెంట్‌లో పోటీపడతాడు. తెలంగాణ జట్టులో ఎంపికైన మునావర్‌ను ఐఎఫ్ఎస్ ఆఫీసర్ షఫీయుల్లా అభినందించి సత్కరించారు.

'ఎల్‌శాట్' దరఖాస్తులకు చివరి తేదీ జనవరి10


సాక్షి, సిటీబ్యూరో: లా స్కూల్ అడ్మిషన్ కౌన్సిల్ డిజైన్ చేసిన ది లా స్కూల్ అడ్మిషన్ టెస్ట్ (ఎల్ఎస్ఏటీ)–ఇండియాను జనవరి 20న నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని నిర్వహణా సంస్థ పియర్సన్ వ్యూ నగర ప్రతినిధులు తెలిపారు. ఈ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకోవాల్సిన చివరి తేదీ జనవరి 10 కాగా, అభ్యర్థులు తమ పేర్లను https://www.lsatindia .in/ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు.

సౌత్‌జోన్ అక్వాటిక్ టోర్నీకి తెలంగాణ జట్టు

సాక్షి, హైదరాబాద్: సౌత్ జోన్ అక్వాటిక్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు తెలంగాణ జట్టును ప్రకటించారు. ఈ టోర్నీ బెంగళూరులో ఈనెల 27 నుంచి 29 వరకు జరుగుతుంది. బాలుర జట్టుకు జోర్డాన్ డొమినిక్ ఫ్రాంక్లిన్.. బాలికల జట్టుకు అదితి నాదెళ్ల.. వాటర్‌పోలో బాలుర జట్టుకు విరించి రెడ్డి.. బాలికల జట్టుకు తనీషా పాలెడ్ నాయకత్వం వహిస్తారు. జాన్ సిద్దిఖీ, ఆయూశ్ యాదవ్ కోచ్‌లుగా, కిరణ్ కుమార్ టీమ్ మేనేజర్‌గా వ్యవహరిస్తారు.

పార్కు అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలి

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



అధికారులతో మాట్లాడుతున్న మేయర్ విజయలక్ష్మి

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.1 లోని జలగం వెంగళరావు పార్కు అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రే తో కలిసి మేయర్ జీవీఆర్ పార్కులో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జలగం వెంగళరావు పార్కులో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు చేపట్టిన పనులను సత్వరమే పూర్తి చేయాలని తెలిపారు. యోగా, మెడిటేషన్ సెంటర్ పూర్తయిన నేపథ్యంలో సత్వరమే ప్రారంభించాలని ఆదేశించారు. టాయిలెట్ పరిశుభ్రంగా ఉండాలని, పార్కు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పార్కులో ఉన్న చెరువునీటిని శుభ్రం చేసి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని చీఫ్ ఎంటమాలజీ అధికారి డాక్టర్ రాంబాబును ఆదేశించారు. వాకర్స్ కోసం ప్రత్యేకంగా వసతులు కల్పించాలని సూచించారు. యోగా, మెడిటేషన్ సెంటర్‌ను ఈ నెల 27న ఉదయం 6.30 గంటలకు ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, డీఎంసీ ప్రశాంతి, యూబీడీ, ఎంటమాలజీ అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌పై బదిలీ వేటు

భారతి హోళికేరికి స్థాన చలనం

- పోస్టింగ్ ఇవ్వని ప్రభుత్వం
- జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశం
- మేడ్చల్ కలెక్టర్ గౌతం పోట్రుకు పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు



భారతి హోళికేరి



గౌతం పోట్రు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: కలెక్టర్ భారతి హోళికేరిపై ప్రభుత్వం బదిలీ వేటు వేసింది. ఆమెకు పోస్టింగ్ కూడా ఇవ్వలేదు. సాధారణ పరిపాలన విభాగం (జీఏడీ)లో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. ఆమె స్థానంలో మేడ్చల్ కలెక్టర్ గౌతం పోట్రుకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించింది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలపై అప్పటి కలెక్టర్ హరీశ్‌పై భారత ఎన్నికల కమిషన్ వేటు వేసింది. ఆయన స్థానంలో స్త్రీశిశు సంక్షేమశాఖ కమిషనర్‌గా పని చేస్తున్న భారతి హోళికేరికి బాధ్యతలు అప్పగించింది.అక్టోబర్ 13న ఆమె కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు.ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించారు. పలు అంశాల్లో నిక్కచ్చిగా వ్యవహరించే వ్యక్తిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఇదే సమయంలో ధరణికి వచ్చిన పలు భూ సంబంధిత దరఖాస్తులను క్లియర్ చేశారు. తన ప్రమేయం లేకుండానే ధరణిలో పలు వివాదాస్పద భూములకు సంబంధించిన అప్లికేషన్లు క్లియర్ అయినట్లు పేర్కొంటూ, ఈ మేరకు ఆదిబట్ల పోలీసు స్టేషన్‌లో కేసు కూడా నమోదు చేయించారు. ఆ తర్వాత ఆ కేసు ముందుకు కదలకుండా నీరుగార్చే ప్రయత్నం చేసినట్లు ఆరోపణలు లేకపోలేదు.

అంతర్గత విచారణ..

భూ రికార్డుల ప్రక్షాళనలో భాగంగా గత ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణిలో జిల్లా వ్యాప్తంగా 35 వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ఒకవైపు ఎన్నికల విధులు నిర్వర్తిస్తూనే మరోవైపు అప్పటి ప్రభుత్వంలోని కొంత మంది పెద్దలు, ఉన్నతాధికారులు, బంధువుల ఆదేశాల మేరకు విలువైన భూములకు సంబంధించిన 20 కీలక దరఖాస్తులను క్లియర్ చేయాల్సి వచ్చింది. ఇదే అదనుగా భావించిన అక్రమార్కులు 53 కోర్టు కేసులు, రెండు పెండింగ్ మ్యూటేషన్లు, రెండు ల్యాండ్ మ్యాటర్స్, 16 అర్బన్ లాండ్ పట్టాదారు పాసు బుక్, 23 నిషేధిత జాబితా, మూడు పాస్‌బుక్ డేటా కరెక్షన్ అప్లికేషన్లు కూడా క్లియర్ కావడంపై వివాదం తలెత్తింది. నిజానికి తహసీల్దార్లు పంపిన ఫిజికల్ రిపోర్టులు, డి సెక్షన్ నుంచి ఇంకా కలెక్టర్ వద్దకు చేరకుండానే వివాదాస్పద మాడ్యుల్స్‌కు సంబంధించిన దరఖాస్తులు ఎలా క్లియర్ అయ్యాయనే అంశంపై కూడా ఆరా తీశారు. ఇదే అంశంపై ఆదిబట్ల పోలీసు స్టేషన్‌లో డిసెంబర్ 5న కేసు నమోదైంది. మొదట్లో ధరణి కో ఆర్డినేటర్, ఆపరేటర్లను అనుమానించి వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. కలెక్టర్ వేలిముద్ర లేకుండా ధరణిలో వచ్చిన దర ఖాస్తు ఆమోదం పొందడం, తిరస్కరించడం కుదరదు. ఈ అంశంపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అంతర్గత విచారణ చేపట్టినట్లు తెలిసింది. ధరణి సమస్యల పరిష్కారంలో కలెక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. ఆ మేరకు భారతి హోళికేరిపై బదిలీ వేటు వేసింది. పోస్టింగ్ కూడా ఇవ్వకుండా జీఏడీలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేయడం కొసమెరుపు.

నేడు గౌతం పోట్రు బాధ్యతల స్వీకరణ!

ప్రస్తుత కలెక్టర్ భారతి హోళికేరిపై బదిలీ వేటు వేసిన ప్రభుత్వం ఆమె స్థానంలో మేడ్చల్ కలెక్టర్ గౌతం పోట్రుకు అదనపు పూర్తి బాధ్యతలు అప్పగించింది. ఏపీలోని కృష్ణా జిల్లాకు చెందిన గౌతం 2015 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. అంతకు ముందు ఆయన సెర్ప్ సీఈఓగా పని చేశారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అప్పటి మేడ్చల్ కలెక్టర్ అమయ్‌కుమార్‌పై భారత ఎన్నికల కమిషన్ బదిలీ వేటు వేసింది. ఆయన స్థానంలో గౌతం పోట్రును అప్పటి ప్రభుత్వం సిఫార్సు చేసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయన మేడ్చల్ కలెక్టర్‌గా కొనసాగుతున్నారు. ప్రస్తుతం రంగారెడ్డి కలెక్టర్‌గా పూర్తి స్థాయి అదనపు బాధ్యతలు అప్పగించింది. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

చట్టాలపై అవగాహనతో మోసాలకు చెక్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీటీ వెంకటేశ్ ప్రసాద్

- ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వెంకటేశ్ ప్రసాద్

షాద్‌నగర్: చట్టాలపై అవగాహన పెంపొందించుకుంటే మోసాలను అరికట్టవచ్చని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వెంకటేశ్ ప్రసాద్ అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లిలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో వినియోగదారుల హక్కులు, విలువలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేశ్ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వినియోగదారుల చట్టాల గురించి తెలుసుకోవాలని తెలిపారు. ఎలాంటి కొనుగోళ్లు, లావాదేవీలు చేసినా విధిగా బిల్లులను తీసుకోవాలని సూచించారు. గ్యారంటీ, వారంటీ ద్వార లబ్ధి పొందాలనుకునే వారు ఇన్వాయిస్, ఇతర బిల్లులను చూపించాల్సి ఉంటుందన్నారు. వినియోగదారుల హక్కులకు చట్టపరంగా రక్షణ ఉంటుందని చెప్పారు. వినియోగదారుల హక్కు చట్టం 2019 ద్వారా న్యాయం పొందొచ్చన్నారు. కొనుగోలు చేసిన వస్తువుల్లో లోపాలు ఉన్నప్పుడు, వ్యాపారులు మోసం చేసినప్పుడు వారిపై వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేయొచ్చని పేర్కొన్నారు. తద్వార పరిహారాన్ని కోరే అవకాశం ఉంటుందన్నారు. వీటితో పాటు వినియోగదారులు తమ హక్కులకు సంబంధించిన పూర్తి వివరాలపై అవగాహన పెంపొందించుకుంటే వ్యాపారులు చేసే మోసాలను అరికట్టవచ్చని ఆయన వివరించారు. దుకాణాల్లో వినియోగదారులకు నాణ్యమైన వస్తువులను అందించాలని, లేని పక్షంలో చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వినియోగదారుల సమాఖ్య ఫోరం సభ్యుడు నక్క బాల్‌రాజ్, గ్యాస్ డీలర్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.



కూచిపూడి నృత్యం చేస్తున్న కళాకారిణులు

సందడిగా ధ్యాన సంబురాలు



ధ్యానకేంద్రానికి తరలివస్తున్న ధ్యానులు

కడ్తాల్: అహింస, ధ్యానం, సేవ, సత్యం అనే అంశాలకు కట్టుబడి, పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ నిరంతరం పనిచేస్తుందని, పీఎస్ఎస్ఎం గ్లోబల్ ఫౌండర్ పరిమళ పత్రి అన్నారు. మహేశ్వర మహాపిరమిడ్ ధ్యాన కేంద్రంలో కొనసాగుతున్న పత్రీజీ ధ్యాన మహాయాగాలు ఆదివారానికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఉదయం 5 నుంచి 8 గంటల వరకు సంగీత వేణునాద గానంతో ప్రాతఃకాల ధ్యానం నిర్వహించారు. అనంతరం ధ్యానులనుద్దేశించి పరిమళ పత్రి ప్రసంగించారు. అందరి లక్ష్యం ధ్యాన, శాఖాహార, అహింస పిరమిడ్ జగత్ అని అన్నారు. ఎంతో మంది నిరక్షరాస్యులు సైతం అద్భుతంగా ధ్యాన ప్రచారాలు నిర్వహిస్తున్నారని.. ఇది ఎంతో గొప్ప విషయమన్నారు. పరిణిత పత్రి మాట్లాడుతూ.. ఆత్మజ్ఞానంతో ఆనందం, ఆరోగ్యం వెల్లి విరుస్తాయని తెలిపారు. అనంతరం స్పిరిచ్యువల్ ఇండియా రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్, ఓషో రజనీష్ రచించిన జీవిత రహస్యాలు, పండంటి రాజమణి త్రిగుణాత్ రచించిన అగ్నిస్పర్శ తదితర పుస్తకాలను పరిమళపత్రి, పరిణిత పత్రి ఆవిష్కరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు గురువులు, పిరమిడ్ మాస్టర్లు తమ ధ్యాన అనుభవాలను వివరించారు. ఆదివారం కావడంతో ధ్యానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ధ్యాన గురువు స్వర్ణమాల పత్రి, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఎంఎంటీఎస్‌కు మరోసారి బ్రేక్

- వీకెండ్స్‌లో సర్వీసుల నిలిపివేత
- ప్రయాణికులు తగ్గుముఖం
- గతంలోనూ ఇదే తరహాలో రద్దు
- ఉచిత బస్సు సదుపాయం కూడా కారణమే..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని వివిధ ప్రాంతాల మధ్య రాకపోకలు సాగించే ఎంఎంటీఎస్ సర్వీసులకు మరోసారి బ్రేక్‌పడింది. శని, ఆదివారాల్లో పలు రూట్‌లలో సర్వీసులను నిలిపివేశారు. ప్రయాణికుల నిరాదరణ కారణంగా గత జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వీకెండ్స్‌లో సుమారు 45 ఎంఎంటీఎస్ రైళ్లను నిలిపివేశారు. తరువాత కొద్ది రోజులు పట్టాలెక్కించినప్పటికీ తాజాగా మరోసారి బ్రేక్‌పడింది. పలుచోట్ల ట్రాక్ మరమ్మతులు వంటి సాంకేతిక అంశాలను సాకుగా చూపుతున్నప్పటికీ ప్రయాణికుల ఆదరణ తగ్గుముఖం పట్టడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ప్రభుత్వం కొత్తగా అందుబాటులోకి తెచ్చిన ఉచిత బస్సు సదుపాయంతో ఎంఎంటీఎస్, సబర్బన్, ప్యాసింజర్ రైళ్లలో మహిళా ప్రయాణికులు తగ్గారు. దీంతో అధికారులు సర్వీసులను తగ్గించినట్లు సమాచారం. మొదట్లో రోజుకు 121 సర్వీసులతో లక్షా 50 వేల మంది రాకపోకలు సాగించేవారు. ఎంఎంటీఎస్ సేవలను పునరుద్ధరించిన అనంతరం అన్ని మార్గాల్లో ప్రతి రోజు 75 రైళ్లను అందుబాటులోకి తెచ్చారు. ప్రయాణికుల నిరాదరణ కారణంగా తరచూ వీటి సంఖ్య సగానికి పడిపోవడం గమనార్హం. మనోహరాబాద్– మేడ్చల్, ఉందానగర్–మేడ్చల్, ఫలక్‌నుమా–లింగంపల్లి, నాంపల్లి–లింగంపల్లి, సికింద్రాబాద్–మేడ్చల్ తదితర ప్రాంతాల మధ్య ఎంఎంటీఎస్ రైళ్లు నడుస్తున్నాయి. మేడ్చల్–ఉందానగర్ మధ్య కొత్తగా రైళ్లను ప్రారంభించారు. ప్రధాని మోదీ చేతుల మీదుగా ఈ రూట్‌లో రైళ్లు పట్టాలెక్కాయి. ప్రారంభించినప్పటి నుంచి ఈ రూట్ రైళ్లకు బ్రేకులు పడుతూనే ఉన్నాయి.

ఆర్టీసీ బస్సుల ఎఫెక్ట్

మహిళా ప్రయాణికులకు ఆర్టీసీ సిటీ ఆర్డినరీ, మెట్రో, జిల్లాల్లో పల్లెవెలుగు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించినప్పటి నుంచి ఎంఎంటీఎస్ సర్వీసుల్లోనే కాకుండా సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్‌ల నుంచి జిల్లాలకు రాకపోకలు సాగించే సబర్బన్, ప్యాసింజర్ రైళ్లలోనూ ప్రయాణికుల సంఖ్య తగ్గింది.

'సాయం చేసే తో'రుణం'

- రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం
- యాసంగిలో విరివిగా లోన్లు
- కసరత్తు చేస్తున్న డీసీసీబీ
- పీఏసీఎస్‌ల నుంచి అర్జీల స్వీకరణ
- 50 శాతం రికవరీ ఉన్న వాటికి ప్రాధాన్యం

డీసీసీబీ వివరాలు

పీఏసీఎస్‌లు: 51
సభ్యులు: 2,50,436
ఇప్పటివరకు ఇచ్చిన మొత్తం రుణం:రూ.1,800 కోట్లు
దీర్ఘకాలిక రుణాలు పొందిన రైతులు: 32,973
స్వల్పకాలిక రుణాలు పొందిన రైతులు: 47,500
2024 మార్చిలోపు రుణ లక్ష్యం: రూ.350 కోట్లు



డీసీసీబీ కార్యాలయం

యాచారం: రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా హైదరాబాద్ (రంగారెడ్డి) జిల్లా సహకార కేంద్ర (డీసీసీబీ) బ్యాంకు యాసంగిలో రైతులకు విరివిగా రుణాలిచ్చేందుకు సంకల్పించింది. దీర్ఘకాలికం, స్వల్పకాలికం కింద దండిగా రుణాలిచ్చేందుకు పీఏసీఎస్‌ల నుంచి అర్జీలు స్వీకరిస్తోంది. దీర్ఘకాలికం కింద పౌల్ట్రీఫాం, డెయిరీఫాం, మేకల, గొర్రెల పెంపకం, స్వల్పకాలికం కింద వ్యవసాయ పంటల్లో పెట్టుబడుల కోసం రుణాలిచ్చేందుకు నిర్ణయించింది. ఇప్పటికే జిల్లాలోని 51 పీఏసీఎస్‌ల్లోని దాదాపు 80 వేల మందికి పైగా రైతులతో పాటు మరో 5 వేల మంది రైతులకు వివిధ రకాల కింద రూ.1,800 కోట్ల రుణాలిచ్చారు. ఇప్పటికే వివిధ రకాల రుణాల కోసం 25 వేల మంది రైతులు అర్జీలు పెట్టుకున్నారు. పీఏసీఎస్‌ల ద్వారా అర్జీలు తీసుకున్న అధికారులు రుణ మంజూరు కోసం డీసీసీబీకి నివేదికలు పంపారు. ఇబ్రహీంపట్నం, యాచారం, మంచాల, కందుకూరు, మహేశ్వరం, షాబాద్ తదితర మండలాల నుంచి అత్యధికంగా దరఖాస్తులు వచ్చాయి. యాచారం, మంచాల, కందుకూరు, మహేశ్వరం, చేవేళ్ల తదితర మండలాల్లోని పలువురు రైతులు అత్యధికంగా దీర్ఘకాలిక రుణాలు పొంది పౌల్ట్రీఫాంలు ఏర్పాటు చేసి ప్రస్తుతం మంచి ఆదాయం పొందుతున్నారు.

రెన్యూవల్ కింద అదనం..

డీసీసీబీ ఈ యాసంగి కింద రూ.350 కోట్ల రుణ లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. 2023–24 ఏడాదికి గాను దీర్ఘకాలికం కింద రూ. 150 కోట్లు, స్వల్పకాలికం కింద రూ.200 కోట్లు ఇచ్చేందుకు నిర్ణయించింది. ఇప్పటికే దీర్ఘకాలికం కింద రూ. 50 కోట్లు అందజేసింది. ప్రస్తుతం మరో రూ. వంద కోట్లు ఇచ్చేందుకు అధికారులు ఫైళ్లను రెడీ చేశారు. దాదాపు 40 వేల మంది రైతులకు స్వల్పకాలికం కింద రూ.200 కోట్ల పంట రుణాలివ్వాలని నిర్ణయించారు. కొత్త పంట రుణాలతో పాటు, రెన్యూవల్ కింద అదనంగా ఇవ్వనున్నారు. అదనంగా రూ.75 కోట్లకు పైగా నిధులతో ఆయా పీఏసీఎస్‌ల్లో రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు, ఫర్టిలైజర్స్ అందించాలని టార్గెట్‌గా పెట్టుకున్నారు. 2024 మార్చి లోపు మొత్తంగా రూ.350 కోట్ల రుణాలివ్వాలని భావిస్తున్నారు. 50 శాతం రికవరీ పూర్తి చేసుకున్న పీఏసీఎస్‌లకు ప్రోత్సాహకం కింద అదనంగా రుణాలిచ్చేందుకు డీసీసీబీ నిర్ణయించింది.

కొత్తగా కర్షకమిత్ర రుణం

డీసీసీబీ 2023–24 ఏడాదికి గాను కొత్తగా కర్షక మిత్ర రుణం రూ.10 కోట్లు ఇచ్చేందుకు నిర్ణయించింది. ఒక్కో రైతుకు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల రుణం ఇవ్వనున్నారు. కర్షకమిత్ర రుణం ద్వారా రైతులు వ్యవసాయ పంటల్లో పెట్టుబడులు, ఇతర వ్యవసాయ పనిముట్ల కోసం ఖర్చు చేసుకోవచ్చు. పీఏసీఎస్‌లో సభ్యులుగా ఉన్న రైతుల కుటుంబాల్లోని పిల్లలు ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లడానికి (పట్టాదారు, పాసుపుస్తకాలు తాకట్టు పెట్టుకుని) రూ.25 లక్షల రుణం, కొత్తగా గృహ నిర్మాణాలు, కొనుగోలు, మరమ్మతుల కోసం రూ.75 లక్షల వరకు రుణాలు ఇవ్వనున్నారు. ఇప్పటికే బంగారు రుణాల కింద రూ. 270 కోట్లు ఇచ్చారు. చిరు వ్యాపారులు, చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవడానికి రుణాలిచ్చేందుకు డీసీసీబీ నిర్ణయించింది.

రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



2024 మార్చి లోపు దీర్ఘకాలిక, స్వల్పకాలికం కింద రూ.350 కోట్లకు పైగా రుణాలిచ్చేందుకు నిర్ణయించాం. త్వరలో జిల్లా వ్యాప్తంగా ఉన్న పీఏసీఎస్‌లను సందర్శించి రైతులకు కావాల్సిన రుణాలిచ్చేందుకు కృషి చేస్తాం. రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం. రుణాలను సద్వినియోగం చేసుకోవాలి.

– కొత్తకుర్మ సత్తయ్య, డీసీసీబీ ఇన్‌చార్జి చైర్మన్

పార్కు స్థలం కబ్జాకు యత్నం!

- హయత్‌నగర్ మండలం మజ్దూర్ ఆర్టీసీ కాలనీలో ఆక్రమణ పర్వం
- అడ్డుకున్న కాలనీవాసులు.. అధికారులకు ఫిర్యాదు
- ఇక్కడ గజం రూ.40 వేల పైమాటే..

హయత్‌నగర్: భవిష్యత్తు అవసరాల కోసం పలు వెంచర్లలో పార్కుల పేరుతో ఖాళీగా వదిలేసిన స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. కళ్లముందే విలువైన కబ్జాకు గురవుతున్నా పట్టించుకున్న నాథుడు లేడు. హయత్‌నగర్ మండలం సర్వే నంబర్ 60/2 నుంచి 60/6 వరకు ప్రభుత్వ భూమి ఉంది. ఏళ్ల క్రితమే ప్రభుత్వం ఈ భూములను ఆర్టీసీ ఉద్యోగులకు కేటాయించింది. ఇందులో మజ్దూర్ ఆర్టీసీ కాలనీ వెలిసింది. ఇప్పటికే ఇందులో నిర్మాణాలు చేపట్టిన వారు తమ ఇళ్లను, నోటరీలపై కొనుగోలు చేసిన భూములను క్రమబద్ధీకరించుకున్నారు. వెంచర్ ఏర్పాటు సమయంలోనే పార్కు కోసం 800 గజాల స్థలాన్ని ఖాళీగా వదిలేశారు. ఇటీవల ప్రభుత్వం ఈ సర్కార్ ఖాళీ స్థలాలను క్రమబద్ధీకరిస్తుండటం, వరుసగా మూడు రోజుల పాటు అధికారులకు సెలవులు రావడం, బహిరంగ మార్కెట్లో ఇక్కడ గజం రూ.40 వేలకుపైగా ధర పలుకుతుండటంతో ఈ భూమిపై కబ్జారాయుళ్ల కళ్లుపడ్డాయి. కబ్జా చేసి ఏకంగా హద్దు రాళ్లు నాటించారు. స్థలంలో మట్టిని నింపి చుట్టూ తాత్కాలిక పలకలు ఏర్పాటు చేశారు. కాలనీవాసులు అడ్డుకుని అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు స్పందించి పార్కు స్థలం కబ్జా కాకుండా అడ్డుకోవాలని కోరుతున్నారు.

మల్లన్న కల్యాణంలో హర్యానా గవర్నర్

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి లక్ష్మీగూడ ప్రాంతానికి చెందిన బీజేపీ నాయకుడు అడికె రాజు నివాసంలో ఆదివారం జరిగిన మల్లన్న స్వామి కల్యాణ మహోత్సవానికి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ పాల్గొని పూజలు చేశారు. అనంతరం అడికె రాజు కుటుంబ సభ్యులు దత్తాత్రేయను ఘనంగా సన్మానించారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: పార్టీలకు అతీతంగా మునిసిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని విద్యానగర్ కాలనీలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇందులో సర్వే నంబర్ 1457, 1459లోని భూములను దేవాదాయ శాఖ నుంచి తొలగించడంతో సంబురాలు చేసుకున్నారు. దీనికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీ సింగ్, మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు రాము, విద్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాష, కార్యదర్శి శేఖర్, వెంకటేశ్వర్ రెడ్డి, పత్యానాయక్, పాండు నాయక్, పర్వతాలు, ఆరిఫ్, ఆనంద్, రాములు, యాదగిరి బాబు, కౌన్సిలర్ సోని, సింగల్ విండో వైస్ చైర్మన్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

మీర్‌పేట: వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ బద్యానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్మాస్‌గూడ ఓల్డ్ విలేజ్‌కు చెందిన రామిడి నర్సింహారెడ్డి, నీలమ్మ (62)లు భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నీలమ్మ.. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

యాచారం: ప్రమాదవశాత్తు విద్యుత్ టవర్‌ను ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధి కుర్మిద్ద గ్రామానికి చెందిన బైకని అశోక్(30) ఓ ప్రైవేట్ కంపెనీలో డ్రైవర్‌గా పని చేసేవాడు. బైక్‌పై శనివారం రాత్రి మీరాఖాన్‌పేట నుంచి స్వగ్రామం కుర్మిద్దకు వస్తున్న క్రమంలో గ్రామ సమీపాన విద్యుత్ టవర్‌కు ఢీకొని, తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సంపూర్ణ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు తెలిపారు.



మొయినాబాద్: శ్రీరాంనగర్ రోడ్డుపై లైట్ల వెలుతురులో వెళ్తున్న వాహనాలు



కందుకూరులో..



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్‌లో పొగ మంచు

కప్పేసిన మంచు దుప్పటి

చలి తీవ్రత పెరిగింది. దాంతో పాటే దట్టమైన పొగమంచు ఊరూవాడను కమ్మేయడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 9 గంటలు దాటినా మంచుతెర తొలగలేదు. వాహన చోదకులు లైట్ల వెలుతురులో వెళ్లినా.. ఎదురుగా వచ్చే వారు కనిపించడం లేదు. దీంతో కొందరు రోడ్డు పక్కనే నిలిపివేయగా.. ఇంకొందరు వేగం తగ్గించి ముందుకు సాగుతున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



షాబాద్: మీరాపూర్ గ్రామంలో..

ప్రజా సంక్షేమమే ధ్యేయం

ప్రజల రుణం తీర్చుకోలేనిది
- నిరంతరం అందుబాటులో ఉంటా..
- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఎమ్మెల్యే శంకర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని, సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం కేశంపేట మండలం పాటిగడ్డ, కేశంపేట, అల్వాల్, మంగలిగూడ గ్రామాల్లో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలు, అభినంద సభల్లో ఆయన ప్రసంగించారు. ఎన్నికల్లో తనకు అండగా నిలిచి, ఘన విజయాన్ని అందించిన ప్రజల రుణం తీర్చుకోలేనిదని ఎమ్మెల్యే అన్నారు. ప్రజల ప్రేమాభిమానాలే తనను గెలిపించాయని, ఇందుకోసం నాయకులు, కార్యకర్తలు ఎంతగానో శ్రమించారని తెలిపారు. వారందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారం కృషి చేస్తానని ఎమ్మెల్యే వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రజారంజక పాలన అందిసుందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, జెడ్పీటీసీ తాండ్ర విశాల, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డిలను నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాదయ్య యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు వీరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వరప్ప, మైనార్టీ నేత ఇబ్రహీం, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ అండగా ప్రభుత్వం

అన్ని మతాలు, కులాల వారికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా కేశంపేట మండలం పాటిగడ్డ గ్రామంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్‌కట్ చేశారు. అనంతరం ప్రభుత్వం సరఫరా చేసిన కానులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తాండ్ర విశాల, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ యాదయ్య యాదవ్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్: కానుకలు అందజేస్తున్న ఎమ్మెల్యే శంకర్ తదితరులు

సర్వమతాల సంక్షేమానికి సర్కారు కృషి

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- క్రైస్తవులకు క్రిస్మస్ కానుకల అందజేత



ఇబ్రహీంపట్నం రూరల్: క్రైస్తవులకు కానుకలు అందజేస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: సర్వమతాల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని శనివారం రాత్రి ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని, కానుకులు పంపిణీ చేశారు. అనంతరం మత పెద్దలతో కలిసి ప్రార్థనలు చేసి మాట్లాడారు. క్రైస్తవుల సంక్షేమానికి నాటి ముఖ్యమంత్రి, దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి ఎంతగానో కృషి చేశారని పేర్కొన్నారు. భవిష్యత్తులో చర్చిల అభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తామని, రావాల్సిన సంక్షేమ పథకాలను అందించేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో ప్రకటించిన ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేసే విధంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్డీఓ అనంత రెడ్డి, తహసీల్దార్ అన్వర్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, ఆదిబట్ల చైర్‌పర్సన్ ఆర్తిక గౌడ్, కాంగ్రెస్ నాయకుడు ఈసీ శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జీఓ 317తో ఇబ్బంది

యాచారం: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెచ్చిన జీఓ 317తో ఇబ్బంది పడుతున్నామని, దూర ప్రాంతాలకు బదిలీ కావడంతో స్థానికతపై ప్రభావం చూపుతోందని జీఓ స్థానికత సాధన సమితి తెలంగాణ బృందం ఆవేదన వ్యక్తంచేసింది. ఈ మేరకు ఎమ్మెల్యే మల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేసింది. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడారు. జీఓ వలన నష్టపోతున్నామని, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, సమస్యలకు పరిష్కారం చూపాలని కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనువాస్‌రావు, శ్రీశైలం, ఆర్థిక కార్యదర్శి చక్రపాణి, అసోసియేట్ అధ్యక్షుడు మల్లేశ్, ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్, లింగస్వామి, కార్తీక్, అనిల్ ఉన్నారు. ఇదిలా ఉండగా.. ఎమ్మెల్యే మల్‌రెడ్డిని నక్కర్తమేడిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ శ్రేణులు తొర్రూర్ క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఫార్మాసిటీని రద్దు చేయించినందుకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో జంగారెడ్డి ఉన్నారు.



యాచారం: ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధ్యాయుల బృందం

సీనియర్ సిటిజన్స్ సమావేశం

రాజేంద్రనగర్: తెలగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాజేంద్రనగర్ మండల స్థాయి తొలి సమావేశాన్ని ఆదివారం భవానీ కాలనీలో నిర్వహించారు. ఈ సమావేశంలో రామారావు, నాగేశ్వర్‌రావు, రాములు, సత్తయ్య, శోభారాణి, మహ్మద్ ముస్తఫాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అసోసియేషన్ పెద్దలు బి.పరమేశ్వర్, కె.రామారావులను సన్మానించారు.

ఇంట్లోనుంచి వెళ్లిపోయిన వ్యక్తి

అత్తాపూర్: ఆర్థిక సమస్యలు, కుటుంబ కలహాలతో భార్యతో గొడవపడి ఓ వ్యక్తి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం.. ఎంఎం పహాడీలో నివసిస్తున్న మహ్మద్ జావిద్ ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావటంతో తరచూ కుటుంబంలో గొడవలు జరిగేవి. ఈనెల 10వ తేదీన ఎవరికీ చెప్పాపెట్టకుండా ఇంట్లోనుంచి వెళ్లిపోయాడు. పలు చోట్ల వెతికినా ప్రయోజనం లేకపోవటంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్లపై మురుగు.. పట్టించుకోని అధికారులు

అత్తాపూర్: సంవత్సర కాలంగా రోడ్లపై మురుగు ప్రవహిస్తున్నా పట్టించుకునేవారు లేరని ఉప్పర్‌పల్లి డైమండ్ అపార్ట్‌మెంట్ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లపై మురుగు పారటం, తీవ్ర దుర్వాసన వస్తుండటంతో డెంగీ, మలేరియా వంటి రోగాల భారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అనేక సార్లు జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదని ఆరోపించారు. రోడ్డు పైకి వెళ్లాలంటే ప్రజలు ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సమస్యలను తమ దృష్టికి ఎప్పటికపుడు తేవాలని, వాటిని వెంటనే పరిష్కరిస్తామని మాటలు చెప్పే అధికారులు.. చేతల్లో మాత్రం ఆ పనితనం కనిపించటం లేదని డైమండ్‌హిల్స్ అపార్ట్‌మెంట్ వాసులు విమర్శించారు. ఇప్పటికైనా మురుగు సమస్యను వెంటనే పరిష్కరించాలని, లేదంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

అసంపూర్తిగా బీటీ రోడ్డు పనులు

- వాహనదారులకు తప్పని అవస్థలు
- రెండేళ్లు కావచ్చినా పూర్తి కాని వైనం



ఘాంసిమియాగూడ శివారులో అసంపూర్తిగా రోడ్డు పనులు

శంషాబాద్ రూరల్: రెండేళ్ల కిందట ప్రారంభించిన రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దారిలో కంకర వేసి వదిలేయడంతో వాహనదారుల నానా కష్టాలు ఎదుర్కొంటున్నారు. మండలంలోని ఘాంసిమియాగూడ నుంచి శంకరాపురం వరకు ఏర్పాటు చేస్తున్న బీటీ రోడ్డు పనులు ఓ అడుగు ముందుకు.. రెండు అడుగులు వెనక్కు అన్నట్లు కొనసాగుతున్నాయి. బెంగళూరు జాతీయ రహదారి నుంచి చెర్లగూడ వరకు ఈ రోడ్డు పనులు చేపట్టారు.

'పీఎంజీఎస్‌వై' నిధులతో..

ప్రధాన మంత్రి గ్రామీణ సడక్ యోజన పథకంలో ఈ రోడ్డు పనులను 2021 జూలై 22న ప్రారంభించారు. రూ.2.82 కోట్ల అంచనా విలువతో పనులు చేపట్టగా.. రెండేళ్లు అయినా ఇంకా పూర్తి కావడంలేదు. ఘాంసిమియాగూడ శివారు నుంచి శంకరాపురం గ్రామం మీదుగా చెర్లగూడ వరకు రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ఈ రోడ్డు మట్టితో ఉండగా.. బీటీ రోడ్డు పనులకు నిధులు మంజూరయ్యాయి.

కంకర దారితో ఇక్కట్లు..

రోడ్డు పనుల్లో భాగంగా కంకర వేసి వదిలేశారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి బీటీ వేస్తే వాహనదారులకు సౌకర్యంగా ఉంటుంది. ఆరు నెలలకోసారి పనులు మొదలు పెట్టి కొద్దిగా పనులు చేసి వదిలేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుమారు 3 కి.మీటర్ల దూరం ఉన్న ఈ రోడ్డుపై వెళ్లడానికి వాహనదారులు నానా అగచాట్లు పడుతున్నారు. బెంగళూరు జాతీయ రహదారి నుంచి ఈ మార్గంలో శంకరాపురం, చెర్లగూడతో పాటు పీ-వన్ రోడ్డుకు చేరుకుంటారు. మార్గ మధ్యలో ప్రతిష్టాత్మకమైన ఐఎంటీ కళాశాల ఉండగా.. రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.